రిపోర్టర్లు కావలెను

ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు

9908862557

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

# ప్రకాశం



జిల్లా వార్తలు

మంగళవారం | 24-2-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 601 పేజీలు: 2 వెల: రూ.7

## పోలీసు బంధుత్వం పేరు చెప్పి..

# క్రికెట్ బుకీల దందా!

* యువకులను బానిసలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు * ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు
* బుకీల నుంచి న్యాయం, రక్షణ కల్పించాలని గ్రీవెన్స్ సెల్‌లో బాధితుడి మొర



**జరుగుమల్లి, ఫిబ్రవరి 23 (జాతీయవార్త):** ఉద్యోగాలు ఇప్పిస్తానని, క్రికెట్ బెట్టింగ్‌తో అధిక లాభం పొందవచ్చని, పోలీస్ బంధుత్వం ఉందని, ఏదైనా చేయగలనని అంటూ బెదిరిస్తున్న ఓ క్రికెట్ బుకీలు దండే హేమంత్ కుమార్, కంచర్ల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని టంగుటూరు మండలం కాకటూరివారిపాలెంకి చెందిన పాతూరి మదన్ కుమార్ కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనది జరుగుమల్లి మండలం చింతల పాలెం అని తెలిపారు. క్రికెట్ బుకీలు కంచర్ల శ్రీనివాసరావు, దండే హేమంత్ కుమార్‌లు గ్రామాలలో యువకులను వ్యసనాలు, బెట్టింగ్ వంటి జూదాలకు బానిసలను చేస్తున్నారన్నారు. వారితో బెట్టింగ్‌లు ఆడిస్తూ మోసగిస్తున్నారన్నారు. వారి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని, గట్టిగా అడిగితే తమ బంధువు పోలీస్ శాఖలో ఎస్పై స్థాయిలో ఉన్నాడని, ఆయనకు చెప్పి కేసులు పెట్టించి జైలుకు పంపిస్తానని బెదిరిస్తున్నారన్నారు. తనను మోసం చేసి తీసుకున్న డబ్బును ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని వాపోయాడు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక చివరికి గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి జేసీ స్పందించి తక్షణ చర్యలు నిమిత్తం ఒంగోలు డీఎస్పీకి సమాచారం అందించారని, తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని బాధితుడు తెలిపారు.



# ఇన్‌చార్జీలే దిక్కు!

* లింగసముద్రం మండలంలో ముఖ్య శాఖల అధికారులందరూ ఇన్చార్జిలే
* రెగ్యులర్ అధికారులను నోచుకోని వైనం
* సకాలంలో పనులు జరగక వెనుదిరుగుతున్న మండలవాసులు * చోద్యం చూస్తున్న కూటమి నేతలు * పట్టించుకోని ఉన్నతాధికారులు



**లింగసముద్రం, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** మండలంలోని అన్ని శాఖలకు ఇన్చార్జిలే దిక్కయ్యారు. ప్రధాన శాఖలకు కూడా ఇన్చార్జీల పాలనలో సాగుతున్నాయి. కొన్ని సంవత్సరాల నుండి రెగ్యులర్ అధికారులు లేక ఇన్చార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. మండలంలో ముఖ్యమైన శాఖలుగా చెప్పుకునే రెవిన్యూ, మండల పరిషత్ శాఖలకు కూడా ఇన్చార్జి అధికారులే ఉన్నారు. ఇక్కడ తహసిల్దారుగా పనిచేస్తున్న కోటేశ్వరరావు జిల్లాల పునర్విభజన సందర్భంగా లింగసముద్రం మండలాన్ని నెల్లూరు జిల్లా నుండి తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతున్న సందర్భంగా ఆయనను బదిలీ చేయడం జరిగింది. అప్పటినుండి కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌గా పనిచేస్తున్న హనుమాయమ్మను ఇన్చార్జి తహసిల్దార్ గా ఉన్నతాధికారులు నియమించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కార్యాలయంలో సూపరింటెంట్ గా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసులు ఇన్చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. చాలా కాలం నుంచి ఈయన కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది జరిగిన బదిలీలలో లింగసముద్రంకు రెగ్యులర్ ఎంపీడీవోను అధికారులు నియమించినప్పటికీ ఆరోగ్య సమస్యల కారణంగా ఆయన సెలవుపై వెళ్లారు. దీంతో తిరిగి శ్రీనివాసులే ఇన్చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. మండలంలో లింగసముద్రం, చిన్నపవని, విఆర్ కోట గ్రామాలలో పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ మూడు పశువైద్యశాలలకు ఒక్కరే డాక్టరు పనిచేస్తున్నారు. చిన్నపవని పశు వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం లింగసముద్రం, విఆర్ కోట పశు వైద్యశాలలకు ఇన్చార్జి వైద్యులుగా వ్యవహరిస్తున్నారు. వారంలో రెండు రోజులు ఒక్కొక్క పశువైద్యశాలలో ఆయన అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. 2024 సెప్టెంబర్‌లో ఇక్కడ వైద్యులుగా పనిచేస్తున్న వారు బదిలీపై వెళ్లడంతో అప్పటినుండి వైద్యశాలలో ఇన్చార్జి వైద్యులే నెట్టుకొస్తున్నారు. విఆర్ కోట పశు వైద్యశాలలో డాక్టర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ గత ఏడాది బదిలీలలో వెళ్లడంతో అప్పటినుండి అక్కడ కూడా ఇన్చార్జి వైద్యులే ఉన్నారు. మూడు పశు వైద్యశాలలకు ఒక్కరే వైద్యులు ఉండడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో మరో ముఖ్య శాఖగా చెప్పుకునే వ్యవసాయ శాఖ అధికారి కూడా ఇన్చార్జినే ఉన్నారు. కందుకూరు లోని పనిచేస్తున్న సిహెచ్ విఎల్ దుర్గా ఇన్చార్జి వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. ఈమె కందుకూరు లోని మట్టి నమూనా పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తుంటారు. గత ఏడాది జరిగిన బదిలీలలో ఏవోగా పని చేస్తున్న అబ్రహం లింకన్ బదిలీపై వెళ్లిన తర్వాత ఇక్కడ ఇన్చార్జి ఏవోలే పనిచేస్తున్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండి రైతులకు వచ్చిన సమస్యలను పరిష్కరించే పని చేయాల్సిన వ్యవసాయ అధికారి మొక్కుబడిగా మండలానికి వస్తున్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమానికి మండలానికి వచ్చి మమా అనిపిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం తప్ప రైతులకు అందుబాటులో ఉండరని రైతుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి మండల హౌసింగ్ ఏఈ పోస్టు ఖాళీగానే ఉంది. గత ప్రభుత్వంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వెంకటేష్‌ని ఇంచార్జ్ ఏఈ గా నియమించి చేతులు దులిపేవారు. ప్రభుత్వం మారిన తర్వాత వలేటివారిపాలెం హౌసింగ్ ఏఈ నాగరాజును లింగసముద్రం మండలానికి ఇంచార్జ్ హౌసింగ్ ఏఈ గా అధికారులు నియమించారు. సుమారు రెండు సంవత్సరాల నుండి ఈయన ఇన్చార్జి హౌసింగ్ ఏఈగా వ్యవహరిస్తున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఎనిమిది మంది మాత్రమే పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు ... మిగతా 2లో

# పని భారం తగ్గించండి

* ఒత్తిడి పెంచి పనిచేయించడం తగదు * సర్వేల పేరుతో టార్గెట్లు సరికాదు * చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయండి * జీవో ఎంఎస్ నంబరు 11 రద్దు చేయాలి * సచివాలయ ఉద్యోగులు * మృతి చెందిన ఉద్యోగులకు సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

**కందుకూరు, ఫిబ్రవరి 23 (జాతీయవార్త):** రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది సచివాలయ ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఆకస్మిక మరణం చెందడంతో వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ స్వర్ణ వార్డ్, స్వర్ణ గ్రామ కందుకూరు డివిజన్ సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కందుకూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాలైన సర్వేలు పేరుతో వాలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకి అప్పగించి ప్రతిరోజూ టార్గెట్లు విధించించడం వల్ల మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. ఈ ఆకస్మిక మరణాల పట్ల తక్షణమే ఒక విచారణ కమీషన్‌ను ఏర్పాటు చేసి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేసి, వారికి తగిన ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు వాలంటీర్ విధులను అప్పగిస్తూ విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబరు 11ను వెంటనే రద్దు చేయాలన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు కల్పించాల్సిన ప్రమోషన్స్‌ను, సీనియారిటీ లిస్ట్‌ను కల్పించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వారు నిరసన వ్యక్తం చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
ప్రకాశం





## ఇన్-చార్జీలే దిక్కు

(మొదటిపేజి తరువాయి)

సెలవుపై ఉన్నారు. కార్యదర్శులు కొరత తీవ్రంగా ఉండడంతో పంచాయతీలలో పాలన కుంటుపడుతుంది. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు వారి సమస్యలు పరిష్కారం గాక నిరాశతో వెనుదిరుఉతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగడం తప్ప పనులు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ముఖ్యమైన శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకొని ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించేలా చూడాలని కోరుతున్నారు.



## ఎట్టకేలకు ప్రాజెక్టు రోడ్డుకు మరమ్మత్తులు

**లింగసముద్రం, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** ఎట్టకేలకు అధికారులు స్పందించి రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి గుంతలను పూడ్చి తారువేశారు. రాళ్లపాడు ప్రాజెక్టు కట్టపైన ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రకాశం నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లో ప్రాజెక్టు ఉండడంతో రెండు జిల్లాల ప్రజలు ప్రాజెక్టు మీదగా రాకపోకలను సాగిస్తుంటారు. దీంతో రోడ్డు అధ్వానంగా తయారై గుంతలు ఏర్పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి పలు సందర్భాలలో ప్రాజెక్టు వద్దకు వచ్చిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన తక్షణమే రోడ్డు మరమ్మత్తుల పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో స్పందించిన అధికారులు ప్రాజెక్టు మీద ఉన్న గుంతలను పూడ్చి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. 2.9 కిలోమీటర్ల రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చి తారు వేయడంతో పాటు ఇతర పనులు కూడా చేయడం జరిగిందని, దీనికి 19.5 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు ప్రాజెక్టు డి.ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ వితరణ



**గుడ్లూరు, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** జనసేన పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ పులి మల్లికార్జున ఆదేశాల మేరకు, గుడ్లూరు కూటమి నాయకులు (జనసేన పార్టీ మండల అధ్యక్షులు) సనిశెట్టి గిరిబాబు నేతృత్వంలో గుడ్లూరు మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్‌ను సోమవారం అందించారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఈ ఎలక్ట్రికల్ బెల్ ను అందించడం పట్ల పాఠశాల సిబ్బంది రామాల తిరుపతిరెడ్డి, భాషా తదితరులు గిరిబాబుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 25న చలో విజయవాడ



**గుడ్లూరు, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** గుడ్లూరు మండలం లోని బసిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 25న నిర్వహించనున్నట్టు ఛలో విజయవాడ సమర శంఖారావం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రకాశం జిల్లా అధ్యక్షులు శాతల వెంకటేశ్వర్లు, గుడ్లూరు మండలం నుండి కాపులూరి వెంకటేశ్వర్లు, కందుల శ్రీనివాసులు, పిగిలి కోటేశ్వరరావు, మద్దసాని రామ్మూర్తి, సుమతి, ఆర్.సులోచన, ఎం.భువనేశ్వరి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**ఉలవపాడు, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ కళాశాలతోపాటు వీరేపల్లి మోడల్ స్కూల్, కరేడు కేజీబీవీ విద్యార్థులు ఉలవపాడు కేంద్రంలో పరీక్షలు జరుగుతున్నాయి. ఈ మూడు కళాశాలలకు చెందిన 218 మంది కి 8 మంది గైర్హాజరైనట్లు ఉలవపాడు చీఫ్ సూపరింటెండెంట్ జి గోపిచంద్ ప్రకాష్ తెలిపారు.

# పునాదుల్లోనే గృహాలు


### ✻ జగనన్న కాలనీ పేరు మార్చినా ముందుకు సాగని గృహ నిర్మాణాలు ✻ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**ఉలవపాడు, ఫిబ్రవరి23 (జాతీయ వార్త):** ఎప్పటికైనా పేదల సొంతిల్లు సాధ్యమేనా అనే సందేహం కలిగే పరిస్థితులు తయారయ్యాయి. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. జిల్లా కలెక్టర్ నుంచి ఆశాఖ ఉన్నతాధికారుల వరకు ప్రతి నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యాలు నిర్దేశిస్తున్నా అనుకున్న స్థాయిలో పురోగతి లేదు. నిర్మాణ వ్యయం పెరిగి, ప్రభుత్వ సాయం చాలక పునాదుల్లోనే ఇళ్ల నిర్మాణాలు ఆగిపోతున్నాయి. కొత్త కాలనీలు కాదు.. కొత్తగా ఊర్లే ఏర్పడుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్క నేత నుంచి వచ్చిన మాటలు.. అయితే ఇప్పుడు ఆయా కాలనీలలో పరిస్థితులు గమనిస్తే కనీసం చిట్టడవులను తలపించేలా ఆయా కాలనీలు ఉన్నాయి. నాయకుల మాటలు నమ్మి ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల బిక్కుబిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్లనిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు కనీస వసతులు కూడా లేకపోవటంతో అక్కడ ఉండలేక... అక్కడ ఇంటిని వదిలి మళ్లీ పట్టణంలోకి వచ్చి అద్దె ఇళ్లల్లోకి రాలేక సతమతమవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి నిలువునా మోస పోయామని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. అన్ని వసతులు కల్పన పూర్తయిన తరువాతనే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం, గృహ ప్రవేశాలు జరుగుతాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. ఆచరణలో మాత్రం పరిస్థితి వేరుగా మారింది. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక లబ్ధిదారులు హడావుడిగా ఇళ్లనిర్మాణం చేసుకున్నారు. సుమారు 1000 పైచిలుకు మంది లబ్ధిదారులకు కొల్లూరుపాడు, రాజుపాలెంలో లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. కొల్లూరుపాడులో ఉన్న లేఅవుట్ ఉలవపాడుకి సుమారు 3 కి.మీ దూరంలో ఉంది. లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. కనీస రవాణా వసతి కూడా లేదు. వర్షం పడితే కాలనీకి వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో ప్రస్తుతం 15 మంది లబ్ధిదారులు మాత్రమే నివాసం ఉంటున్నారు. దీంతో రాత్రిసమయంలో బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు. ఇక కొల్లూరుపాడులో ఉన్న లేఅవుట్లో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నా కనీస వసతులు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం మినహా మిగిలిన ఎలాంటి కనీస వసతుల కల్పన జరగలేదు. కనీసం గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్లు, తాగునీటి వసతుల కల్పన కూడా లేకపోవడంతో నివాసం ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీల పేర్లను ఎన్టీఆర్ కాలనీలుగా మార్పు చేశారు. అయితే ఆయా కాలనీలలో వసతుల కల్పనపై మాత్రం కూటమి ప్రభుత్వం ఇంకా దృష్టి పెట్టలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వమైనా ఆయా కాలనీలలో కనీస వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.







## వికసిత్ భారత్ రాంజీ పథకాన్ని రద్దు చేయాలి

**ఉలవపాడు, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** గ్రామీణ పేదలకు ఆసరాగా ఉంటున్న మహాత్మ గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసిన ఫాసిస్టు మోడీ ప్రభుత్వం నిధులు, హక్కులు లేని 'వికసిత్ భారత్– జిరాంజీ' పథకాన్ని తీసుకొచ్చిందని, తక్షణం దీన్ని రద్దు చేయాలని అఖిలభారత రైతు–కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాంచార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు, సోమవారం అఖిల భారత రైతు –కూలి సంఘం ఆధ్వర్యంలో ఉలవపాడు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఆ తర్వాత ఎంపీడీవోకు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి రాంజీ చట్టంలో సెక్షన్ 5/1 ప్రకారం ఉపాధి పనులు కూడా కేంద్రం నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే పెట్టవలసి ఉంటుందని, ఒకవేళ నోటిఫై చేయకపోతే ఆ ప్రాంతాలు ఉపాధి పనులు కొనసాగవన్నారు. రాష్ట్రాలకు, పంచాయతీలకు ఎలాంటి హక్కులు ఉండవని, ఈ చట్టంలోని సెక్స్ సెక్షన్ 6/2 ప్రకారం వ్యవసాయ పనులు సీజన్‌లో 60 రోజులు పనులు ఇవ్వరాదని నిర్ణయించిందన్నారు. ఇలాంటి అనేక నిబంధనలు ఉపాధి కూలీలకు పని హక్కును ధ్వంసం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పునర ఆలోచన చేసి గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.మంజుల మాట్లాడుతూ దేశంలో ప్రధానంగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం అంటే మహిళల ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీయటమేనని మహిళల పని హక్కు పై దాడి చేయడమేనని అందువలన ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మోహన్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు టి వెంకట్రావు, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సిఎస్ సాగర్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు శివపార్వతి, సంఘం నాయకులు చౌటూరి అలెగ్జాండర్ రావినూతల ఆశీర్వాదం, కత్తిపద్మ, చలంచర్ల కుమారి పాల్గొన్నారు.




## వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

**ఉలవపాడు, ఫిబ్రవరి 23 (జాతీయ వార్త):** పెదపట్టపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సోమవారం పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్, అమలు జరిగే విధానం, మధ్యాహ్నం భోజనం గురించి ఉలవపాడు మండల విద్యాశాఖ అధికారి 2 పి.వి, రమణయ్య సమీక్షించారు. మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు జరగనుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేవారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఎస్కే సలీం భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546